క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు

బలిజిపేట: స్థానిక వేంకటేశ్వర ఆలయం వద్ద కల్యాణ మండపంలో ఈ నెల 3న శనివారం వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ గురువారం తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పాల్గొంటారని తెలిపారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. మండల పార్టీ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మండలానికి 25 గోశాలలు

సీతానగరం: మండలంలో 25 గోశాలలు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు అన్నారు. మొదటి విడతగా వీటిని మంజూరు చేసినట్టు గురువారం చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక త్వరలోనే చేపడతామన్నారు. అవసరమైన వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూగజీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు.

వర్గీకరణతో ఎంతో మేలు

బలిజిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షించదగ్గదని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ గురువారం తెలిపారు. వెనుకబడిన ఎస్సీలకు దీనితో మేలు జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అవసరం ఉందన్నారు. రాష్ట్రాలకు దీనిపై వెసులుబాటు ఉండాలని సుప్రీంకోర్టు చెప్పడం ఎంతో గొప్ప విషయమన్నారు. దీనిని స్వాగతిస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ కిశోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బెలగాం 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ వర్కులు, ట్రీ కటింగ్ కారణంగా ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. పట్టణంలోని చర్చివీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ బ్యాక్‌సైడ్ గల కాలనీ, గూడ్స్‌షెడ్ రోడ్డు, జనశక్తి కాలనీ, నాయుడువీధి, బంగారమ్మ కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అంటిపేటలో వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పావని

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ కార్యాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 32 మందికి వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధుల కాలం దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు శర్మ, భవాని, సత్యవతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు తమ వంతు సేవలు అందించారు.

నిఘా నీడలో..



పట్టణ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

సాలూరు: పట్టణ ప్రధాన ముఖద్వారాలు వద్ద సీసీ కెమెరాలను పోలీసు ఏర్పాటు చేస్తోంది. గుర్తించిన ప్రాంతాల్లో రాష్ట్రమంతటా ఈ విధంగా సీసీ కెమెరాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన చోటే కొత్తగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

97.28 శాతం పింఛన్ల పంపిణీ

పార్వతీపురం: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ పథకంలో పింఛన్లను ఆగస్టు ఒకటవ తేదీ తొలి రోజున గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి జిల్లాలో 97.28 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో 1,43,398 మంది లబ్ధిదారులకుగాను 1,39,515 మందికి రూ.57.96 కోట్లు పంపిణీ జరిగింది. జిల్లాలో పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లను, క్షేత్ర స్థాయిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని మండల ప్రత్యేకాధికారులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు.

ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వెలుగుసిబ్బంది, వైద్యసిబ్బందితో పింఛన్ల పంపిణీకి ఏర్పాటు చేశారు. కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు.

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం



పాచిపెంటలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్‌పిపి ప్రమీల

తల్లి పాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తల్లి పాలు బిడ్డల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. దీన్ని ప్రతి తల్లి గుర్తించాలన్నారు. బిడ్డలకు తల్లి పాలు మాత్రమే పట్టాలన్నారు. పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ వెంకటరమణ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

– పాచిపెంట

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

బలిజిపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ స్థానిక కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, బోర్డు నిధులు రూ.2వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాలన్నారు. ఇసుక రీచ్ పాయింట్లకు అవకాశం ఇచ్చి భవన నిర్మాణ కార్మికులకు పని కలిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి సిహెచ్.సుబ్బయ్య, చక్రధర్, మజ్జి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇతరులకు ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు



మక్కువ ప్రధాన రహదారి వద్ద గస్తీ కాస్తున్న పోలీసులు

మక్కువ: మండల కేంద్రం నుంచి పార్వతీపురం, బొబ్బిలి పట్టణాల్లోని కళాశాలలకు విద్యాభ్యాసం నిమిత్తం వెళ్తున్న పలువురు విద్యార్థులు తోటి ప్రయాణికులను, విద్యార్థినిలను ఇబ్బంది పెడుతున్నట్టు పోలీసులకు ఫిర్యాదులు అందుతుండడంతో మక్కువ ప్రధాన రహదారి వద్ద పోలీసులు గురువారం ప్రత్యేక నిఘా పెట్టారు. కళాశాలల నుంచి బస్సుల్లో వచ్చిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు బాధ్యతగా చదువుకోవాలని ఇతరులను ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. చదువుపై కాకుండా ఆకతాయిలుగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. ఇకపై విద్యార్థులపై ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి



మాట్లాడుతున్న ఎంఈఓ సూరిదేముడు

సీతానగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో మంచిగా విద్యాబోధనలు జరుగుతున్నాయని, ఫలితంగా ప్రవేశాలు కూడా మంచిగా జరిగాయన్నారు. హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి సంధ్యారాణి



పట్టణంలో ఫించను సొమ్ములు పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: పట్టణం, సాలూరు, పాచిపెంట మండలాల్లో ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో 24వ వార్డు సచివాలయం ఎరకల వీధి, 18వ వార్డు సచివాలయం చిన్నకుమ్మరి వీధి, సాలూరు మండలం జీగిరాం, పాచిపెంట మండల కేంద్రంలో ఇరుక వీధిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 64.82 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.2737 కోట్లు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్యులు

కురుపాం: రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 1వ తేదీ నుండి పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు కార్యక్రమంలో భాగంగా కురుపాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం నేత్ర వైద్య సహాయకులు రమేష్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు నెలలు పాటు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తుందని, అలాగే నేత్రాలకు సంబంధించిన ఎటువంటి శస్త్ర చికిత్సలు అవసరమైతే వారికి ఉచితంగా ప్రభుత్వ, కార్పొరేటు ఆస్పత్రులలో చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఐ.కిరణ్‌కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేయాలని ఆందోళన



పెదమేరంగి కూడలి వద్ద రాస్తారోకో చేస్తున్న సీపీఎం శ్రేణులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద రహదారి పూర్తిగా గోతుల మయం కావడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారని దీన్ని మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు గురువారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వేలలో వాహనాలు కురుపాం, గుమ్మలక్ష్మీపురం మీదుగా ఒడిశా వెళ్తున్నాయని అన్నారు. వర్షం పడితే చాలు మూడు అడుగుల లోతు ఏర్పడుతుందని దానితో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వెంటనే చర్యలు తీసుకొని రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, జిల్లా సహాయ కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి

- ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని చిన మంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్య, వారికి అందించిన యూనిఫారాలు, పుస్తకాలు, హాజరుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం జామి రవి, తతదిరులున్నారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: డీఎస్సీ 2024 టెట్ పరీక్షలకు మన్యం జిల్లాలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీఈఓ జి.పగడాలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా బేస్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బేస్‌మెంట్ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆశక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల7లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు యొక్క ప్రతిని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

నేడు మండల సమావేశం

గుమ్మలక్ష్మీపురం: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.రమేష్‌బాబు గురువారం తెలిపారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నిషేధిత ఉత్పత్తులను రవాణా చేస్తే చర్యలు



వాహనాల్లో బ్యాగ్‌లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ దేవి తదితరులు

మెంటాడ: వాహనాల్లో నిషేధిత ఉత్పత్తులను రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ బి.దేవి అన్నారు. మండలంలోని పిట్టాడ గ్రామ జంక్షన్‌లో వాహనాలను గురువారం తనిఖీ చేశారు. గంజాయి రవాణా అవుతుందన్న సమాచారంతో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గంజాయి తదితర నిషేధిత ఉత్పత్తులను రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

సీతంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ ఎంవీఐ టి.వేణుగోపాలరావు, ఏఎంవీఐ జీఎస్ఎస్ఆర్‌కే కుమార్, మెడికల్ ఆఫీసర్ పీవీ రామారావు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ పీవీ రామారావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

కురుపాం: మండల కేంద్రంలోని కోర్టు సమీపంలో వాహన చోదకులకు, ప్రజలకు రహదారి భద్రతపై బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ గురువారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, పరిమితికి ప్రయాణికులను ఎక్కించకూడదని, ప్రతీ వాహనదారుడు సంబంధిత ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడితల్లి, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం టౌన్: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందన్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 900 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వంతో చర్చించి తన వంతు కృషి చేస్తానన్నారు. కళాశాల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవాలని అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు, అధ్యాపకులు ఆకుల రాజు, తెర్లీ రవికుమార్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌సీ సేవలు ఆదర్శం



హెచ్‌సీ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న ఐఆర్‌పీడబ్ల్యూఏ సిబ్బంది

పార్వతీపురం టౌన్: హెచ్‌సీ కృష్ణమూర్తి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ పి.కె.ప్రకాష్ అన్నారు. బెలగాం రైతు బజార్ సమీపంలో ఉన్న నిరాశ్రయ వసతిగృహంలో హెడ్ కానిస్టేబుల్ కోమిరి కృష్ణమూర్తిని గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వేతనంలో కొంత మొత్తాన్ని పేదలకు వెచ్చించి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ మంచిపల్లి శ్రీరామమూర్తి, వైద్యులు యాల్ల వివేక్, రెడ్‌క్రాస్ సభ్యులు జనార్దన్, శ్రీనివాసరావు, నిరాశ్రయుల వసతిగృహ సిబ్బంది గణేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో అంతర్జాతీయ ఆటో డ్రైవర్ల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఆటో డ్రైవర్లు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం రైల్వేస్టేషన్ పరిధిలో అంతర్జాతీయ ఆటోడ్రైవర్ల దినోత్సవాన్ని ఆటో యూనియన్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆటో డ్రైవర్లు అందరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేసేందుకు తక్కువ రవాణా చార్జీలతో సేవలందిస్తున్నామని వారు తెలిపారు. ఆటో డ్రైవర్లకు గత ప్రభుత్వం ప్రతీ ఏటా వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేలు అందజేసేదని ఆ సొమ్ము ఆటో మరమ్మతు పనులకు అవసరమయ్యేదని తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అదే తరహాలో పథకాన్ని అమలు చేసి ఆటో డ్రైవర్ల పక్షాన నిలవాలని కోరారు. కార్యక్రమంలో బొత్స కుమార్, గంగాడ రాము, బత్తలు కృపారావు, బోనెల రమేష్, పి.ఆదినారాయణ, గౌరీ, దుర్గా ప్రసాద్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సీతానగరం: మరిపివలసలో ఫించన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతానగరం: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఉదయాన్నే తనిఖీ చేశారు. మండలంలోని సూరంపేట పంచాయతీ మరిపివలసలో కలెక్టర్ పర్యటించారు. పంపిణీ జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సజావుగా పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో 1,43,398 పింఛన్లు ఉన్నాయని ఇందుకు రూ.59.58 కోట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాంబందొర,, ఎంపీటీసీ బి.వరలక్ష్మి, ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పార్వతీపురం టౌన్: పట్టణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 19, 13 వార్డుల్లో ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 5507 వివిధ రకాల పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అందుకుగాను రూ.2.38 కోట్లను ప్రభుత్వం ఖర్చు పెట్టిందన్నారు. మొదటి రోజు 89శాతం పంపిణీ పూర్తి చేశామన్నారు. సచివాలయ ఇబ్బంది, వెలుగు సిబ్బందితో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టు కిందే పంపిణీ

బలిజిపేట: చిలకలపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బీసీ కాలనీలోని చెట్టు కింద గురువారం పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బంది చేపట్టారు. అక్కడికి వెళ్లి లబ్ధిదారులు అందుకోవాల్సి వచ్చింది. దీంతో పలువురు ఇబ్బందులు పడ్డారు.

చెరకు వంగడాలపై అవగాహన



చెరకు రైతులకు అవగాహన కలిస్తున్న నిపుణులు

పాలకొండ: చెరకు రైతులకు సంకిలి ఈఐడీ ప్యారీ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సాగులో మెలకువలు, అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఏవీపీ పట్టాభిరామరెడ్డి మాట్లాడుతూ, అధునాతన పద్ధతులు అవలంభించడం వల్ల దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు. ఆర్‌అండ్‌డీ హెడ్ డాక్టర్ రాజేశ్వరి, కేన్ హెడ్ రమేష్ రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్‌కో ఈఈ వీవీ కిశోర్ కుమార్ ఆదేశాల మేరకు గరుగుబిల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్న తరుణంలో వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి



ఎంపీడీఓ గీతాంజలికి వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘ నాయకులు

సీతంపేట: ఉపాధి హామీ వేతనదారులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని గిరిజన సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ గీతాంజలిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేతనాలు అందక వేతనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, శ్రీరాములు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.